సాక్షి సూర్యాపేట

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



హోరాహోరీగా ఖోఖో పోటీలు
భువనగిరిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు రెండో రోజు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. - 8లో



అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్
ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



ఇది తిరోగమన బడ్జెట్
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని తిరోగమన దిశలోకి నెడుతోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

సూర్యాపేటటౌన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా కొనసాగింది. జిల్లా కేంద్రంలో తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 2,126 మంది విద్యార్థులకు 1,781 మంది హాజరు కాగా 345 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కె.అశోక్ తెలిపారు. ఆయన పలు సెంటర్లను తనిఖీ చేశారు.

24 నుంచి టీసీసీ పరీక్షలు

సూర్యాపేటటౌన్ : టీసీసీ(టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు)లో భాగంగా డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వారి వెంట కుట్టు మిషన్ తీసుకొని రావాలని కోరారు. అభ్యర్థులు హాల్ టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

టీజేఎస్ సదస్సు వాయిదా

భానుపురి (సూర్యాపేట) : కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా – కేంద్ర ప్రభుత్వ వివక్షత, బీఆర్‌ఎస్ వైఫల్యంపై ఆదివారం తెలంగాణ జనసమితి నిర్వహించ తలపెట్టిన సదస్సును వాయిదా వేస్తున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గట్ల రమా శంకర్, ప్రధాన కార్యదర్శి దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్టీ అధ్యక్షుడు కోదండరాం సూచన మేరకు వచ్చే వారం నిర్వహిస్తామని తెలిపారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పలువురు తహసీల్దార్లకు స్థానచలనం

సూర్యాపేట : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సొంత జిల్లాలో పని చేసేవారిని, ఒకేచోట మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారితోపాటు జూన్‌లోపు రిటైర్డ్ అయ్యే తహసీల్దార్లకు స్థానచలనం కలిగించింది. ఇందులో భాగంగా చిలుకూరు తహసీల్దార్ సునీత నాగర్‌కర్నూల్ జిల్లాకు, చివ్వెంల తహసీల్దార్ రంగారావు సంగారెడ్డి జిల్లాకు, మోతె తహసీల్దార్ ప్రకాశ్‌రావు జనగామ జిల్లాకు బదిలీ అయ్యారు. జనగామ కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మాన్‌సూరి, దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న సంఘమిత్ర, రంగారెడ్డి జిల్లా షాబాద్ తహసీల్దార్ చిన్న అప్పల నాయుడు, నల్లగొండ జిల్లా కనగల్ తహసీల్దార్ జ్యోతి సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

సీఐల బదిలీ

సూర్యాపేట క్రైం: పలువురు సీఐలను బదిలీ చేస్తూ హైదరాబాద్ రేంజ్ ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీజోన్- 2 సీఐడీలో పనిచేస్తున్న ఇ.రఘువీర్‌రెడ్డిని నాగారం సర్కిల్‌కు, నాగారం సీఐగా పనిచేస్తున్న సీఐ కె.శివశంకర్‌ను మల్టీజోన్-2 ఐజీ కార్యాలయానికి, హుజూర్‌నగర్ సీఐగా పనిచేస్తున్న వై.రామలింగారెడ్డిని సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్‌కు, మల్టీజోన్-2 ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న జి.చరమంద రాజును హుజూర్‌నగర్ సర్కిల్‌కు, కోదాడ రూరల్ సీఐ డి.రామకృష్ణారెడ్డిని మునగాల సర్కిల్‌కు, మునగాల సర్కిల్ సీఐ పి.వీరరాఘవులును సూర్యాపేట సీసీఎస్‌కు బదిలీ చేశారు.

జిల్లా ఉద్యాన అధికారిగా నాగయ్య




కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా తీగల నాగయ్య బాధ్యతలు చేపట్టారు. శనివారం కలెక్టర్ ఎస్. వెంకట్రావును ఆయన మర్యాద పూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఉద్యానవన అధికారిగా విధులు నిర్వహించిన శ్రీధర్ గౌడ్ సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మిర్యాలగూడ డివిజన్ ఏపీడీ నాగయ్యను బదిలీ చేశారు. నాగయ్యను జిల్లా పట్టు పరిశ్రమ ఏడీ విరాకుమార్, ప్రాంతీయ ఉద్యాన అధికారి జగన్, సిబ్బంది నరహరి, మురళి, ఝాన్సీ, నరేష్, నరేందర్, డ్రిప్ కంపెనీ సిబ్బంది మల్లేష్, అనిల్, సైదులు , అఖిల్, శ్రీకాంత్, మోహన్ సన్మానించారు.

గ్యారంటీలకు ప్రాధాన్యం

- బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్దపీట
- ఆయా పథకాలతో జిల్లా ప్రజలకు ప్రయోజనం కలిగే అవకాశం
- ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రాధాన్యం.. బీసీలకు నిరాశ
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- రూ.2లక్షల రుణమాఫీపై అస్పష్టత



సూర్యాపేట : ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు ప్రాధాన్యమిస్తూ వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్ద పీట వేశారు. ఆరు గ్యారంటీల అమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించడంతో జిల్లాలో కొంతమేర లబ్ధిచేకూరనుంది. రైతు రుణమాఫీకి ప్రత్యేకంగా నిధులేమీ ప్రకటించకపోవడంతో రైతులకు రుణ విముక్తి కలిగే అవకాశం ఇప్పట్లో లేనట్లే. సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణానికి నిధులు ప్రకటించడంతో కొందరికి ప్రయోజనం కలగనుంది.

మహాలక్ష్మి, గృహజ్యోతికి నిధులు



ఇప్పటికే మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్య కల్పించిన విషయం తెలిసిందే. ఇక ఈ పథకంలో రూ. 2,500 నగదుకు 3,18,054 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి త్వరలో లబ్ధి చేకూరనుంది. ఇక గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ కోసం 2,75,272 కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా ఇందులో అర్హులకు ఉచితంగా విద్యుత్ అందనుంది. రూ. 500 గ్యాస్ సిలిండర్‌కు 3,26,383 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ రెండు పథకాల అమలుకు కసరత్తు కొనసాగుతోంది.

రైతుకు భరోసా ఇచ్చేందుకు..



రైతు భరోసా పథకంతో రైతులు, కౌలు రైతులకు ఏటా ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని ప్రకటించింది. సూర్యాపేట జిల్లాలో సుమారు 2.60 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద ప్రస్తుతం ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రతి సీజన్‌లో రూ.306 కోట్లు అందుతున్నాయి. ఈ పథకం కింద కొత్తగా 1,60,334 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా 12,056 మంది కౌలు రైతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. పాతవారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన రైతులకు భరోసా అందనుంది.

చేయూతతో ఆసరా..

జిల్లాలో ప్రస్తుతం 1,54,931 మంది లబ్ధిదారులకు పింఛన్ అందుతోంది. అయితే కాంగ్రెస్ తమ గ్యారంటీల్లో దివ్యాంగులకు రూ.6వేలు, ఇతరులకు రూ. 4 వేల వరకు పింఛన్ పెంచి అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారితో పాటు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న సుమారు 80వేల మందిలో అర్హులకు చేయూత లభించే అవకాశం ఉంది.

బీసీలపై చిన్నచూపు



రాష్ట్ర బడ్జెట్‌లో షెడ్యూల్డ్ కులాలకు ప్రాధాన్యమిచ్చారు. ఎస్సీ సంక్షేమానికి రాష్ట్రంలో రూ.21,874 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారు. జిల్లాలో సుమారు 52వేల దళిత కుటుంబాలు ఉండగా ఇందులో 2,08,326 మంది దళితులు ఉన్నారు. ప్రత్యేక నిధుల కేటాయింపుతో అధికంగా సబ్సిడీ రుణాలు అందే అవకాశం ఉంది. ఎస్టీల ప్రత్యేక ప్రగతికి రూ.13,013 కోట్ల కేటాయించారు. అయితే జిల్లాలో 35 వేల గిరిజన కుటుంబాల్లో 1,41,271 మంది ఉన్నారు. నిధుల కేటాయింపుతో ఎస్టీలకు కొంత మేర ప్రయోజనం కలగనుంది. ఇక జిల్లాలో 83 శాతం జనాభాకు పైగా ఉన్న బీసీలపై ప్రభుత్వం చిన్నచూపు చూపింది. బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.8వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న బీసీ కుటుంబాలకు నిరాశ తప్పదు. ఇక మైనార్టీలకు రూ. 2,262 కోట్లు కేటాయించగా జిల్లాలో 77 వేల మంది మైనార్టీలకు కొంత మేర లబ్ధిచేకూరనుంది.

సొంతింటి కల సాకారం దిశగా..

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో 5 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా కేవలం 800 ఇళ్లు మాత్రమే పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మొదటి విడతలో మంజూరు చేస్తామని ఆర్థికశాఖ మంత్రి ప్రకటించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం15,000 కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఇటీవల నిర్వహించిన ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్లకు జిల్లాలో 3,16,885 దరఖాస్తులు వచ్చాయి.

రుణమాఫీకి ఎదురుచూపే..



ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన రూ.2లక్షల రుణ మాఫీకి ప్రత్యేకించి నిధులు కేటాయించ లేదు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రూ.లక్ష లోపు రుణ మాఫీ హామీలో భాగంగా ముందుగా రూ.25వేల లోపు, తరువాత రూ. 50వేల లోపు వ్యవసాయ రుణాలను మాఫీ చేసింది. రూ.లక్షలోపు రుణాల మాఫీని ఎన్నికల ముందు ప్రారంభించింది. కొంత మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ కాగా.. ఎన్నికల కోడ్ రావడంతో ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. సుమారు లక్ష మంది రైతులు రుణ విముక్తి కోసం ఎదురుచూస్తున్నారు. అయితే రూ.2 లక్షల రుణ మాఫీకి కసరత్తు జరుగుతోందని మంత్రి ప్రకటించడంతో కాస్త ఆశ ఉన్నా ఆలస్యం తప్పేలా లేదు.



బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో భట్టిని కలిసిన వారితో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

గృహజ్యోతి అమలు హర్షణీయం



కాంగ్రెస్ పార్టీ శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి పథకాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టి అమలు చేయడం హర్షణీయం. పేద మహిళలకు ఈ పథకం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ అందించడానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం ఆనందంగా ఉంది.

– మల్లిరెడ్డి అరుణ, అనంతారం, పెన్‌పహాడ్ మండలం

అభివృద్ధికి ప్రాధాన్యమిస్తే బాగుండేది



ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆరు గ్యారెంటీల అమలు, రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో కేటాయింపులు చేసినట్లు ఉంది. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వడం శుభపరిణామం. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యమిస్తే ఇంకా బాగుండేది. పూర్తిస్థాయి బడ్జెట్‌లో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తారని ఆశిద్దాం.

– డాక్టర్ చందా అప్పారావు, అర్థశాస్త్ర సహాయ ఆచార్యుడు, హుజూర్‌నగర్

కౌలు రైతులను గుర్తించడం సంతోషం



తెలంగాణ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించడం సంతోషకరం. అంతేకాకుండా వారికి పంట పెట్టుబడి సాయం అందించడం, బీమా సౌకర్యం కల్పించడం బాగుంది. ఈ ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి దాదాపు రూ.20 వేల కోట్లు కేటాయించడం వల్ల రైతాంగానికి మేలు కలుగుతుంది.

– కొప్పోజు సూర్యనారాయణ, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

భారీగా ఎస్‌ఐల బదిలీ

- ఉత్తర్వులు జారీచేసిన ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ రాహుల్ హెగ్డే శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న జి.అజయ్‌కుమార్‌ను నడిగూడెం పోలీస్‌స్టేషన్‌కు, అనంతగిరి ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.అనిల్ రెడ్డిని కోదాడ రూరల్‌కు, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ ఎం.నవీన్‌కుమార్‌ను అనంతగిరి పీఎస్‌కు, సూర్యాపేట వీఆర్‌లో ఉన్న బి.అంజిరెడ్డిని మునగాల పీఎస్‌కు, కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.రాంబాబును చిలుకూరు పీఎస్‌కు, సూర్యాపేట వీఆర్‌లో ఉన్న ఎ.రవిందర్‌ను నేరేడుచర్ల పీఎస్‌కు, నల్లగొండ డీసీఆర్‌బీలో ఉన్న కె.లక్ష్మీనర్సయ్యను పాలకవీడు పీఎస్‌కు, సీసీఎస్ సూర్యాపేట ఎస్‌ఐగా పనిచేస్తున్న ఈ.సైదులును గరిడేపల్లి పీఎస్‌కు, సూర్యాపేట వీఆర్‌లో ఉన్న జి.ముత్తయ్యను హుజూర్‌నగర్ పీఎస్‌కు, నేరేడుచర్ల ఎస్‌ఐ పి.పరమేశ్‌ను మేళ్లచెర్వు పీఎస్‌కు, కోదాడ పట్టణ ఎస్‌ఐ బి.యాదవేందర్‌రెడ్డిని మోతె పీఎస్‌కు, గరిడేపల్లి ఎస్‌ఐ పి.వెంకటరెడ్డిని నాగారం పీఎస్‌కు, హుజూర్‌నగర్ ఎస్‌ఐ పి.హరికృష్ణను ఎస్‌బీ సూర్యాపేటకు, మోతె ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లును డీసీఆర్‌బీ సూర్యాపేటకు, చిలుకూరు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌ను వీఆర్ సూర్యాపేటకు, ఎస్‌బీలో పనిచేస్తున్న ఆర్.సాయిరాంను సూర్యాపేట ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వీఆర్‌లో ఉన్న వి.మల్లేశంను కోదాడ ట్రాఫిక్‌కు, మునగాల ఎస్‌ఐ పి.లోకేష్‌ను సూర్యాపేట వన్ టౌన్‌కు, మఠంపల్లి ఎస్‌ఐగా పనిచేస్తున్న సీహెచ్.బాలకృష్ణను సూర్యాపేట టూటౌన్‌కు, సీసీఎస్ నల్లగొండ ఎస్‌ఐ ఎ.రంజిత్‌రెడ్డిని కోదాడ టౌన్ పీఎస్‌కు, కోదాడ టౌన్ ఎస్‌ఐ ఎ.రామాంజనేయులును మఠంపల్లి పీఎస్‌కు, సూర్యాపేట వన్ టౌన్ ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌ను వీఆర్ సూర్యాపేటకు, వీఆర్ సూర్యాపేటలో ఉన్న ఈ.విల్సన్‌ను వీఆర్ నల్లగొండకు, సూర్యాపేట వీఆర్‌లో ఉన్న వి.నాగేశ్వరరావును వీఆర్ నల్లగొండకు, మేళ్లచెరువు ఎస్‌ఐ పి.సురేష్‌యాదవ్‌ను వీఆర్ సూర్యాపేటకు, సూర్యాపేట పీసీఆర్‌లో పనిచేస్తున్న యు.నగేష్‌ను కోదాడ టౌన్ పీఎస్‌కు, పాలకవీడు ఎస్‌ఐ ఎం.లింగంను సీసీఎస్ సూర్యాపేటకు, నార్కట్‌పల్లి ఎస్‌ఐ బి.శ్రీకాంత్‌గౌడ్‌ను వీఆర్ సూర్యాపేటకు, వీఆర్‌లో ఉన్న ఎన్.యాదయ్యను యాదాద్రి జోన్ – 4లో సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలు ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అధికారులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పీఎం విశ్వకర్మ పథకంపై జిల్లా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ పథకంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 న గ్రామ సభలు నిర్వహించి పథకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏ కులస్తులైనప్పటికీ చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు అర్హులని, ఇంట్లో ఉద్యోగం ఉన్న వారు అర్హులుకారని, అలాగే ఒకే ఇంట్లో ఇద్దరికి పథకం వర్తించదని పేర్కొన్నారు. జిల్లాలో 3916 దరఖాస్తులు అందాయని , సీఎస్‌సీలకు వెళ్లి దరఖాస్తు చేయవచ్చని సూచించారు. సమావేశంలో సీఈఓ సురేష్, పరిశ్రమల శాఖ జీఎం తిరుపతయ్య, డీపీఓ యాదయ్య, ఎల్‌డీఎం బాపూజీ, కమిటీ సభ్యులు బొబ్బా భాగ్యారెడ్డి, వీరేందర్, అక్కిరాజు యశ్వంత్, ఏఎం శ్రీచరణ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మాస్టర్ ట్రైనర్స్ శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. మాక్ పోల్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా శిక్షణ తోడ్పడుతుందన్నారు. నియోజకవర్గాల్లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి పూర్తి స్థాయిలో ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమీల

- 'హస్త'గతమైన మున్సిపల్ పాలకవర్గం
- వైస్ చైర్మన్‌గా కందుల కోటేశ్వరరావు
- ప్రశాంతంగా సాగిన ఎన్నిక ప్రక్రియ

కోదాడ: కోదాడ మున్సిపల్ పాలకవర్గం హస్తగతమైంది. చైర్‌పర్సన్‌గా 4వ వార్డు కౌన్సిలర్ సామినేని ప్రమీల, వైస్ చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 27న కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, వైస్‌చైర్‌పర్సన్ వెంపటి పద్మ తప్పుకున్నారు. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించి శనివారం కోదాడ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు.

మారిన రాజకీయ పరిణామాలు

కోదాడ మున్సిపాలిటీలో 35 వార్డులు ఉన్నాయి. 2019 మున్సిపల్ ఎన్నికల్లో 25 వార్డులు బీఆర్‌ఎస్, 8 వార్డులు కాంగ్రెస్, ఒకటి టీడీపీ, ఒకటి సీపీఐ గెలుచుకున్నాయి. వీరిలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఒకరు మరణించారు. 2023 ఎన్నికల ముందు 17 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ కాంగ్రెస్‌లో చేరారు. అయితే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్‌తో పాటు కొందరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు జనవరి2న తీర్మానం కాపీ అందజేశారు. మొదట జనవరి 17న అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించినప్పటికీ చైర్‌పర్సన్ కోర్టుకు వెళ్లడంతో జనవరి 27న పెట్టారు. ఈ అవిశ్వాసం నెగ్గారు. దీంతో శనివారం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు.

ఎన్నిక ఇలా..

చైర్మన్, వైస్ చైర్మన్ కోసం శనివారం నిర్వహించిన సమావేశానికి 29 కౌన్సిలర్లు హాజరయ్యారు. వీరిలో 26 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక సీపీఐ కౌన్సిలర్, ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు. వీరంతా కలిసి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, మాజీ వైస్ చైర్‌పర్సన్ వెంపటి పద్మ, కౌన్సిలర్లు ఎస్‌కె. షఫీ, కల్లూరి పద్మజ, బెజవాడ శిరీషలు సమావేశానికి హాజరు కాలేదు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన సామినేని ప్రమీల, కందుల కోటేశ్వరరావులకు ఆర్‌ఓ సూర్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరనాయక్‌లు నియామక పత్రాలు అందించారు. అనంతరం చైర్‌పర్సన్ కార్యాలయంలో ప్రమీల బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లను మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, పారా సీతయ్య, ఈదుల కృష్ణయ్య తదితరులు అభినందించారు.




నియామకపత్రాలను అందుకుంటున్న చైర్‌పర్సన్ ప్రమీల, వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సామినేని ప్రమీల

నాడు మిస్సయ్యింది.. నేడు కలిసొచ్చింది..

సుదీర్ఘకాలం టీడీపీలో, ఆ తరువాత బీఆర్‌ఎస్ చేరి 2023 అసెంబ్లీ ఎన్నికలకు 20 రోజుల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ సామినేని ప్రమీల అనూహ్యంగా కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకున్నారు. 2019లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కోదాడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పీఠం జనరల్ మహిళకు రిజర్వు చేశారు. 35 స్థానాలకు గాను 25 స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకుంది. బీఆర్‌ఎస్ నుంచి 4వ వార్డులో గెలిచిన కౌన్సిలర్ సామినేని ప్రమీల చైర్మన్ పదవికోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా అప్పటి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ 2వ వార్డు నుంచి గెలిచిన బీసీమహిళ వనపర్తి శిరీషకు చైర్మన్ పదవిని ఇచ్చారు. అప్పటి ఎమ్మెల్యేతో చైర్‌పర్సన్ భర్త విభేదించడంతో ఇద్దరి మధ్య సఖ్యత కొరవడింది. ఈక్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు ఎన్నికల ముందు, ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికలకు మరో 20 రోజుల సమయం ఉందనగా నాడు చైర్‌పర్సన్ పదవికి పోటీ పడిన సామినేని ప్రమీల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిక సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ఆమెకు చైర్‌పర్సన్ పదవికి ఎంపిక చేసినట్లు సమాచారం. ఈమె గతంలో తమ్మరబండపాలెం సర్పంచ్‌గా పనిచేశారు.



నూతన చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు

సూర్యాపేట ఆర్డీఓగా వేణుమాధవరావు

భానుపురి : సూర్యాపేట ఆర్డీఓగా ఆర్.వేణుమాధవరావు బదిలీపై రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కె.వీరబ్రహ్మచారిని ఆర్డీఓగా నియమించగా ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన సెలవుపై వెళ్లారు. దీంతో ఆత్మకూర్ (ఎస్) తహసీల్దారు సీహెచ్.కృష్ణయ్యకు మొదటఅదనపు బాధ్యతలు, తర్వాత పూర్తి బాధ్యతలు అప్పగించారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఆర్డీఓలకు స్థానచలనం కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేయగా.. హైదరాబాద్‌లో పనిచేస్తున్న వేణుమాధవరావునుపేట ఆర్డీఓగా బదిలీ చేశారు.

ఏఆర్ సిబ్బంది సేవలు విలువైనవి

- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం: ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది సేవలు విలువైనవని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఏఆర్ సిబ్బందికి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగియడంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరావు, ఏఆర్అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, డీఎస్పీలు నాగభూషణం, రవి, శ్రీనివాస్, ఆర్‌ఐ నారాయణ రాజు, జిల్లా సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్, అడ్మిన్ ఆఫీసర్ సురేష్ బాబు, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న టీజీయూఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. జీఓ నంబర్ 317 పరిష్కరించి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ఆప్షనల్ హాలిడేగా ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీజీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ గోవింద్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతిలాల్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానోతు సైదులునాయక్ ఉన్నారు.

విచారణ జరిపించాలి




ధర్నాలో మాట్లాడుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నేరేడుచర్ల: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం నేరేడుచర్లలోని జడ్జర్ల –కోదాడ ప్రధాన రహదారిపై సీపీఐఎంఎల్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు లేని నిరుపేదలకు 121 గజాల స్థలంతో పాటు రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలన్నారు. స్థానిక పరిశ్రమల్లో 70శాతం మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, 30 శాతం వరకు స్థానికేతరులను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి. వెంకటేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అఖిల్, పార్టీ డివిజన్ కన్వీనర్ పల్లయ్య, సయ్యద్, కరుణాకర్, సత్యక్క, పావని, మరియమ్మ, గోపి, మౌలాంబి తదితరులు ఉన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ. 17.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- రెండు బైక్‌లు సీజ్
- పరారీలో మరో ముగ్గురు నిందితులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద రూ.17.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసు వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ రాజశేఖర్ సిబ్బందితో సూర్యాపేట పట్టణంలోని లాడ్జిల్లో తనిఖీలు చేపట్టగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లి పాండురంగాపురం గ్రామానికి చెందిన సంపటి ఉమాప్రసాద్ పట్టుబడ్డాడని తెలిపారు. అతడిని. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. ఉమా ప్రసాద్ చిన్న వయసులో చదువుకు స్వస్తి పలికి చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. సూర్యాపేట పట్టణంలో రెండు సంవత్సరాల్లో నిందితుడు 6 దొంగతనాలకు పాల్పడ్డాడన్నాని తెలిపారు. ఇతనికి మరో ముగ్గురు నిందితులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లిపాండురంగాపుంకు చెందిన తెల్లనాగు మురుగేశ్, మహ్మద్‌అంజద్‌పాషా, హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన రోషన్‌కుమార్ సింగ్‌లు సహకరించారని. వీరు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుడు సంపటి ఉమా ప్రసాద్‌కి 2017 సంవత్సరం వరకు నేర చరిత్ర ఉందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చి కూడా పాత వృత్తినే కొనసాగిస్తూ కేరళలో కూడా చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. నిందితుడిపై ఖమ్మం జిల్లా, కేరళ రాష్ట్రంలో మొత్తం 12 కేసులు ఉన్నాయన్నారు.

జైలు నుంచి విడుదలై..

కేరళ జైలు నుంచి కొన్ని నెలల క్రితం విడుదలైన ఉమా ప్రసాద్ సూర్యాపేట పట్టణంలోని లాడ్జిలో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. దొంగిలించిన సొత్తులో కొంత దాచుకొని, మిగితా సొమ్ము తన స్నేహితులైన మురుగేశ్, అంజద్ , రోషన్ లతో కలిసి పంచుకొని, కొంత కుదువపెట్టి ఆ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉమా ప్రసాద్‌ను విచారించగా గత డిసెంబర్ 13నుంచి సూర్యాపేటలో ఉంటూ కృష్ణా కాలనీ, విద్యానగర్, అంజనాపురి కాలనీ, భగత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద 8 తులాల బంగారు, డైమండ్ ఆభరణాలు, 5700 విదేశీ నోట్లు, ఒక యమహా స్కూటీ, ప్యాషన్ ప్రో బైక్, దొంగతనానికి వాడిన కట్టర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగిలించిన మొత్తం సొత్తు విలువ రూ.17,50,000 ఉంటుందని తెలిపారు. నిందితుడు ఉమాప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులను ఛేదించడంలో చాకచక్యత ప్రదర్శించిన సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు యస్.కె. యాకూబ్, ప్రవీణ్‌కుమార్, కుశలవ, సైదులు, కరుణాకర్, కష్ణ, సైదులు, ఆనంద్, శివ కష్ణ , మధు, సుధాకర్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

- ఇమాంపేట బాలికల గురుకుల పాఠశాలలో ఘటన
- ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలతో కలకలం
- ఇటీవల యాదాద్రి జిల్లాలో ఇద్దరు బాలికలు ఆత్మహత్య

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండలంలోని ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సూర్యాపేట పట్టణానికి చెందిన వెంకన్న, భాగ్యమ్మల కుమార్తె దగ్గుపాటి వైష్ణవి (17) గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురుకుల పాఠశాలలో శనివారం ఫేర్‌వెల్ డే ఉండగా విద్యార్థిని తండ్రి ఉదయం 9గంటలకు వచ్చి పూలు , గాజులు ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం పాఠశాల ఆవరణలో జరిగిన ఫేర్‌వెల్ డేలో వైష్ణవి పాల్గొన్నది. అయితే ఈ కార్యక్రమం జరుగుతుండగానే వైష్ణవి హాస్టల్ గదికి వెళ్లిపోయింది. గంట తర్వాత తోటి విద్యార్థులు వెళ్లి చూడగా వైష్ణవి అపస్మారకస్థితిలో ఉంది. ఈ విషయాన్ని వారు వెంటనే ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బందికి చెప్పడంతో వైష్ణవిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హాస్టల్ సిబ్బంది ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు కూడా తెలియజేయడంతో వారు



శనివారం సాయంత్రం తన తల్లితో వీడియో కాల్‌లో మాట్లాడిన వైష్ణవి

ఏరియా ఆస్పత్రికి వచ్చారు. తమ కూతురును విగతజీవిగా చూసి బోరున విలపించారు. శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ డేకు వెళ్లేందుకు తయారైన తర్వాత వీడియో కాల్ చేసి తమతో నవ్వుతూ మాట్లాడిందని విద్యార్థిని తల్లిదండ్రులు వెంకన్న, భాగ్యమ్మ రోదిస్తూ తెలిపారు. తమ కూతురు కొన్ని రోజుల క్రితం ఇంటికి వచ్చిన సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కలిసి ఎలా చదువుతున్నావని పలకరించిందని చెప్పారు. అప్పుడు



సూర్యాపేట ఆస్పత్రివద్ద వైష్ణవి తల్లిదండ్రులు

తమ కూతురు.. హాస్టల్‌లో అన్నం బాగుండడం లేదని, రాళ్లు వస్తున్నాయని చెప్పగా అక్కడి నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ ఫోన్‌లో ప్రిన్సిపల్‌తో మాట్లాడారని చెప్పారు. ఈ విషయం మనసులో పెట్టుకుని తమ కూతురును వేధించారని, దీంతోనే మనస్తాపంతో మృతిచెందిందని, తమ కూతురును హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వారు ఆరోపించారు. వైష్ణవి మృతదేహంపై గాయాలు ఉండడంతో తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. సూర్యాపేట రూరల్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం హాస్టల్‌కు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, వారం రోజుల క్రితం భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరుకముందే సూర్యాపేటలో మరో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతిచెందడం కలకలం రేపింది.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

భువనగిరి క్రైం : బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు బాలుడిని క్షేమంగా శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లాలోని రాతాల రాంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు, తన భార్య రాధమ్మ కుమారుడు సిద్దిరాముడు, సోదరి రాజేశ్వరితో కలిసి జీవనోపాధి నిమిత్తం ఈ నెల 4న భువనగిరి పట్టణానికి వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ ఎదురుగా ఉన్న బట్టల దుకాణం ముందు పడుకున్నారు.అయితే, బీబీనగర్ మండలంలోని గూడూరుదండి గ్రామానికి చెందిన బానోతు మోహన్‌కు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్యకు గర్భసంచి తీసివేశారు. అతనికి మగ పిల్లవాడు సంతానం కావాలని తెలిసిన వారు ఎవరైనా ఉంటే చెప్పమని డబ్బులు ఇస్తామని చెప్పేవాడు. రాయగిరి స్టేషన్‌కు చెందిన దూరపు బంధువైన పాల్త్య విజయ, ఓరుగంటి శమంతలు భువనగిరి పట్టణంలోని ఓ గ్లాస్ కంపెనీలో పనిచేస్తున్నారు. మోహన్ కోరిక మేరకు పాల్త్య విజయ సదరు బాలుడిని అపహరించి మోహన్‌కు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.కిడ్నాప్‌కు నిందితుడు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని వారి వద్ద నుంచి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐ నాగరాజు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ మాంగళ్యధారణ నిర్వహించారు.

‘గ్యారంటీ’ బడ్జెట్‌పై హర్షం

రుణమాఫీ ప్రస్తావన లేకపోవడం, సాగునీటికి అరకొర కేటాయింపులపై అసంతృప్తి

రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆయా వర్గాల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం అవుతోంది. కానీ రైతు రుణమాఫీ ఊసు లేకపోవడం, ప్రాజెక్టులకు అరకొరగా నిధుల కేటాయింపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

కేటాయింపు కాదు.. ఖర్చు చేయాలి



అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం కనిపించడం లేదు. గత ప్రభుత్వాలు చేసిన విధంగా కేటాయింపులే కాకుండా వాటిని క్రమపద్ధతిలో ఖర్చు చేయాలి. బడ్జెట్‌లో రైతులకు కొంత ఊరట కల్పించినా.. భవిష్యత్‌లో రైతుబంధుకు నిధులు ఏ విధంగా సమకూరుస్తారో స్పష్టత లేదు.

– మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

అన్ని వర్గాలకు అనుకూలం



ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మాదిరిగా ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయిస్తూనే.. వ్యవసాయ, విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పించారు. బడ్జెట్‌లో కేటాయింపులు తక్కువే ఉన్నా.. ఆ మొత్తం సకాలంలో ఖర్చు చేయాలి.

– బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి

విద్యారంగానికి నిధులు పెంచాలి



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగానికి కాస్త సమంజసంగానే ఉంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. గురుకుల పాఠశాలలతో సమానంగా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం కేటాయింపు కూడా ఉండాలి. విద్యా రంగానికి బడ్జెట్ ఇంకా పెంచాల్సిన అవసరం ఉంది. విద్యారంగంలో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేసి విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉంది.

– సీహెచ్.రామలింగారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రజా అవసరాలు తీర్చే బడ్జెట్



అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా అవసరాలు తీర్చేలా ఉంది. ప్రజలు కోరుకున్న విధంగా వారి సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ రూపొందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా నిధులను కేటాయించారు. రైతాంగానికి పెద్దపీట వేశారు. అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. సూర్యాపేట జిల్లా ప్రజలంతా ఈ బడ్జెట్‌ను హర్షిస్తున్నారు.

– చెవిటి వెంకన్నయాదవ్, డీసీసీ అధ్యక్షుడు

ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు మేలు



ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుంది. బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధులు కేటాయించడం హర్షనీయం. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇవ్వడం వల్ల అర్హులకు ఇల్లు మంజూరవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే హామీలను అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తోంది. – వీరబోయిన సువర్ణ, గృహిణి, వట్టిఖమ్మంపహాడ్, చివ్వెంల మం.

నిధులు కేటాయించడం సంతోషదాయకం



రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించి నిధులు కేటాయించడం సంతోషదాయకం. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఈ పథకంతో ఎంతో మేలు చేస్తుంది. త్వరితగతిన ఈ నిధులను విడుదల చేసి ఈ పథకం అర్హులందరికీ వర్తించేలా చూడాలి.

– సరిత, గృహిణి, ఆత్మకూర్(ఎస్)

ఎన్నికల హామీలు నెరవేర్చేలా ఉంది



ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీ పథకాలకు రూ.53,196 కోట్ల అంచనా వ్యయాన్ని చూపించడం ఎన్నికల హామీలు నెరవేర్చాలా కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు పెరిగాయి. మూసీనది ప్రక్షాళనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడం శుభపరిణామం. రానున్న రోజుల్లో కేటాయింపులకు చేసే వ్యయంపైనే బడ్జెట్ తీరుతెన్ను ఆధారపడి ఉంటుంది. – డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య, అర్థశాస్త్ర రిటైర్డ్ అధ్యాపకుడు

గ్యారంటీల అమలు దిశగా బడ్జెట్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందే దిశగా ఈ బడ్జెట్ ఉంది. గత బడ్జెట్‌తో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది. ప్రజా శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా బడ్జెట్ ఉంది. వాస్తవిక బడ్జెట్‌ను ప్రజల ముందు ఉంచింది. విద్యా రంగానికి ఈసారి ప్రాధాన్యం ఇచ్చారు.

– పాండరయ్య, అర్థశాస్త్రం అధ్యాపకుడు, ఎంజీయూ

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి

- గుండెపోటుకు గురైన మహిళకు ఎస్‌ఐ తక్షణ సాయం
- ఆస్పత్రికి తరలించగా కోలుకున్న బాధితురాలు
- వలిగొండ ఎస్‌ఐ మహేందర్ లాల్‌కు అభినందనల వెల్లువ



గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేస్తున్న ఎస్‌ఐ మహేందర్

వలిగొండ : గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు.. ఓ ఎస్‌ఐ. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామానికి చెందిన బోయిన వెంకటమ్మ శుక్రవారం బంధువులతో కలిసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో శ్రీ పార్వతీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం శనివారం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో వలిగొండ మండల కేంద్రంలో బస్టాండ్‌లో భువనగిరి వైపు వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వెంకటమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన వలిగొండ ఎస్‌ఐ మహేందర్‌లాల్ వెంటనే ఆమెకు సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చింది. వెంటనే ఆ మహిళను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకున్నారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలను కాపాడిన ఎస్‌ఐ మహేందర్ లాల్ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

పకడ్బందీగా ఈవీఎంల చెకింగ్



ఎంట్రీ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న నోడల్ అధికారి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంలో చేపడున్న ఎఫ్‌ఎల్‌సీని శనివారం జిల్లా ఎన్నికల నోడల్ అధికారి బి. తిల్లైవి, కలెక్టర్ ఎస్. వెంకట్రావుతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈసీఐ నిబంధన మేరకు ఈ నెల 5 నుంచి 14 వరకు ఈసీఎల్ ఇంజనీర్లతో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్‌ఎల్‌సీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కృష్ణయ్య, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస రాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇది తిరోగమన బడ్జెట్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని పూర్తిగా తిరోగమన దిశలోకి నెడుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అటకెక్కించే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ఇటువంటి మోసపూరిత బడ్జెట్‌ను దేశ చరిత్రలో ఏరాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రవేశ పెట్టలేదని విరుచుకుపడ్డారు. రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తీసుకురాలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. ఆలీబాబా 40 దొంగల్లా.. సీఎం రేవంత్ బ్యాచ్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కృష్ణా జలాలపై హక్కును కాపాడుకోవాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. కృష్ణా జలాల విషయంలో ఈరోజు వరకు కేంద్రాన్ని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు? కాంగ్రెస్ దొంగతనాలను బయటపెట్టాలనే నల్లగొండలో సభకు శ్రీకారం చుట్టామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ ఉన్నారు.

12న రైతు సదస్సు

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో ఈ నెల 12న రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించనున్నట్లు కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కంపెనీ వారు తమ ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఐసీఏఆర్ న్యూ ఢిల్లీ ఉద్దం సింగ్ గౌతం, ఏటీఏఆర్‌ఐ హైదరాబాద్ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా హాజరుకానున్నారని పేర్కొన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న ఖోఖో పోటీలు



తలపడుతున్న నల్లగొండ-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు

భువనగిరి : భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్ షిప్-2023-24 పోటీలు రెండో రోజైన శనివారం హోరాహోరీగా కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు14 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో ఎనిమిది మహిళలు, ఆరు పురుషులకు సంబంధించిన పోటీలు ఉన్నాయి. ఆదివారం చివరి రోజు నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. రెండో రోజు జరిగిన పోటీల్లో ఎస్‌ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు

రెండో రోజు ఈ జట్ల మధ్యనే..

మహిళల లీగ్ పోటీలో రెండో రోజు మహబూబ్ నగర్ ఖమ్మంపై 10-08, రంగారెడ్డి అదిలాబాద్ జిల్లా జట్టుపై 08-05,హైదరాబాద్ మెదక్‌పై 13-06, నల్లగొండ నిజామాబాద్‌పై 09-03, మహబూబ్‌నగర్ వరంగల్‌పై 09-01, రంగారెడ్డి కరీంనగర్ పూ 13-02, ఖమ్మం నిజామాబాద్‌పై 12-11,ఆదిలాబాద్ మెదక్‌పై 06-05, పురుషుల లీగ్ పోటీల్లో కరీంనగర్ మెదక్ పై 15-11, వరంగల్ నల్లగొండ పై 11-10, అదిలాబాద్ నిజామాబాద్‌పై 15-08, ఖమ్మం మహబూబ్‌నగర్ పై 12-08, వరంగల్ హైదరాబాద్ పై 14-12, కరీంనగర్ రంగారెడ్డి జిల్లా జట్టు పై 15-14 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.





ఖోఖో పోటీలో ఆదిలాబాద్-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు, మెదక్ - రంగారెడ్డి జట్లు



తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జట్ల క్రీడాకారులు